రేషన్ షాపుల్లో బ్యాంకింగ్

- మినీ బ్యాంకులుగా అవకాశం
- నగదు లావాదేవీలు, బిల్లుల చెల్లింపులు ఇక సులభతరం
- ఆసరా పింఛన్లు, ఉపాధిహామీ కూలి డబ్బులు ఇక్కడే..
- ఏజెన్సీవాసులకు మరింత ప్రయోజనకరం



భద్రాచలం పట్టణంలోని రేషన్ షాపు..

భద్రాచలంటౌన్: సరిగా కమీషన్లు రాక, కనీస వేతనాలు చెల్లించక ఇబ్బందులు పడుతున్న రేషన్ డీలర్లకు ఉపాధి అవకాశాలను పెంచే విధంగా పౌరసరఫరాల శాఖ కసరత్తు ప్రారంభించింది. రేషన్ డీలర్లను ఆదుకుని, వారికి ఆదాయ మార్గలు చూపే విధంగా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఇందుకోసం రేషన్ షాపుల ద్వారా మినీ బ్యాంకు సేవలను అందించే విధంగా చర్యలు చేపట్టారు.

ఇందుకోసం ముందుగా జిల్లాలోని అన్ని మండలాల రేషన్ డీలర్ల సంఘం ముఖ్య నాయకులతో జిల్లా పౌరసరఫరాల శాఖ, పోస్టల్ శాఖ అధికారులు సమావేశం నిర్వహించారు. రేషన్ షాపులను మినీ బ్యాంకులుగా మార్చడం ద్వారా డీలర్లు ఏ రకంగా ఉపాధి పొందవచ్చు అనే విషయాలపై అవగాహన కల్పించారు. ఏజెన్సీలోని ప్రతి గ్రామంలో రేషన్ షాపు ఉండడంతో అయా గ్రామాల్లోని డీలర్లకు మినీ బ్యాంకుల నిర్వహన ద్వారా ఆదాయం పెరుగుతుంది.

పోస్టల్ శాఖతో జతకలిసి..

పౌరసరఫరాల శాఖ మినీ బ్యాకులను ఇండియన్ పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ) సహకారంతో విస్తరించాలని అధికారులు నిర్ణయించారు. మినీ బ్యాంకుల సేవలు నగరాలు, పట్టణాలు, మండల కేంద్రాలలోనే అందుబాటులో ఉంటాయి. బ్యాంకింగ్ సేవలు అంతగా అందుబాటులో లేని ఏజెన్సీ గ్రామాలలో ఇవి బాగా ఉపయోగపడుతాయి. వినియోగదారులు రేషన్ షాపు మినీ బ్యాంకుల ద్వారా నగదు, డిజిటల్ లావాదేవీలు, విద్యుత్, ఫోన్ తదితర బిల్లులు చెల్లించవచ్చు. దీంతో గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు బ్యాంకింగ్, డిజిటల్ సేవలు మరింత సులభంగా, సౌకర్యవంతంగా మారనున్నాయి. ఉపాధిహామీ కూలీలకు చెల్లింపులు, ఆసరా పింఛన్ల నగదు చెల్లింపులు వంటివి చేయవచ్చు.

డీలర్లకు అదనపు ఆదాయం

ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీ ఉంటుంది. తరువాత రోజులల్లో డీలర్లు ఖాళీగా ఉంటారు. ఈ సమయాన్ని డిజిటల్ లావాదేవీలకు వినియోగించడంతో అదనంగా ఆదాయం లభిస్తుంది. ఈ క్రమంలో డీలర్లు లావాదేవీలు విస్తరిస్తే దానికి అనుగుణంగా కమీషన్ ఇస్తారు. ప్రతి లావాదేవీకి రూ.4 చొప్పున నెలలో రూ.5 లక్షలు దాటితే రూ.11 చొప్పున డీలర్లకు కమీషన్ చెల్లించనున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు బ్యాంకింగ్ సేవల కోసం పట్టణాలకు, మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పని ఉండకపోగా.. డీలర్లకు అదనపు ఆదాయం అందించినట్లైంది.

అవగాహన ఉన్నవారికి ప్రాధాన్యత..

బ్యాంకింగ్ సేవలు, స్మార్ట్‌ఫోన్ వినియోగంపై అవగాహన ఉన్న డీలర్లను ముందుగా ఎంపిక చేస్తున్నారు. మినీ బ్యాంక్ సేవలను రేషన్ షాపు ద్వారా చేసే ముందు డీలర్లు రూ.1,200 అనుమతులకు సంబంధించిన ఫీజు కట్టి రిజిస్టర్ చేయించుకోవాలి. అలా చేయించుకున్న డీలర్లకే మినీ బ్యాంకు సేవలను చేసుకునే విధంగా అధికారులు అవగాహన కల్పించి అనుమతిస్తారు. అధికారులకు, డీలర్లకు సమన్వయ లోపంతో ఈ ప్రక్రియ జిల్లాలో మందకొండిగా సాగుతుంది. జిల్లాలో మొత్తం 442 రేషన్ షాపులు ఉన్నాయి. ఇందులో ఇప్పటి వరకు ఇద్దరు డీలర్లు మాత్రమే రేషన్ షాపులో మినీ బ్యాంకు సేవలు చేసేందుకు రిజిస్టర్ చేసుకున్నారు. మిగతా వారు కూడా రిజిస్టర్ చేయించుకుని తద్వారా వచ్చే ఆదాయ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

డీలర్లు ముందుకు రావాలి



రేషన్ షాపుల్లో బ్యాంకింగ్ సేవలు అందించాలనే ఉద్దేశంతో ఇప్పటికే కొందరు డీలర్లకు అవగాహన కల్పించాం. ఇందుకోసం అవగాహన కార్యక్రమం కూడా నిర్వహించాం. అదనపు ఆదాయం వచ్చే అవకాశం ఉంది కాబట్టి డీలర్లు ముందుకు రావాలి. రేషన్ షాపుల్లో బ్యాంకింగ్ సేవలు ప్రారంభిస్తే గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎంతో ఉపయోగకరం.

– మల్లికార్జునబాబు,
జిల్లా పౌరసరఫరాల అధికారి

ఆర్టీసీ బస్సు అడ్డగింత



ఆర్టీసీ బస్సు ఎదుట బైఠాయించిన సర్పంచ్ శారద, కేశవరెడ్డి, వ్యాపారులు

అశ్వాపురం: మండల కేంద్రంలో ప్రతీ సోమవారం నిర్వహించే వారాంతపు సంత నిర్వహణ విషయంలో మణుగూరు ఆర్టీసీ అధికారుల వైఖరిని నిరసిస్తూ.. అశ్వాపురం–అమెర్ద రోడ్డులో ఆర్టీసీ బస్సును అశ్వాపురం సర్పంచ్ బాణోత్ శారద, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి, స్థానికులు, వ్యాపారులు అడ్డుకున్నారు. అశ్వాపురంలో సోమవారం సంత నిర్వహణకు ఇబ్బంది కలిగించేందుకే ఎప్పుడూ రాని బస్సును ఈ రహదారికి పంపించారని, ఇది కక్షపూరిత చర్య అని సర్పంచ్, స్థానికులు బస్సుకు అడ్డంగా బైఠాయించారు. సమాచారం అందుకున్న పోలీసులు సర్పంచ్, స్థానికులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. అశ్వాపురం–అమెర్ద రహదారి వెంబడి ఏళ్ల తరబడి శిథిలావస్థలో నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్ స్థలంలో అధికారుల అనుమతితో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్థలం చదును చేసి వారాంతపు సంత నిర్వహిస్తున్నారు. గత కొంత కాలంగా ఆర్టీసీ అధికారులు ఆ స్థలంలో సంత నిర్వహణకు అడ్డుచెబుతున్నారు. మా స్థలంలో సంత నిర్వహించాలంటే ఏడాదికి రెండున్నర లక్షలు చెల్లించాలని గ్రామ పంచాయతీ వారిని ఆర్టీసీ వారు అడుగుతున్నట్టు సమాచారం. దీంతో సర్పంచ్, ఉపసర్పంచ్, పాలకవర్గం ఆధ్వర్యంలో డీపీఓ, కలెక్టర్, ఎంపీడీఓకు సమస్యపై పలుమార్లు విన్నవించారు. ఆర్టీసీ వారి స్థలంలో సంత నిర్వహణ సమస్య కొలిక్కి రాకపోవడంతో గత కొన్ని నెలలుగా అమెర్ద రహదారి వెంబడి ఓ ప్రైవేటు స్థలంలో సంత నిర్వహిస్తున్నారు. ఆ స్థలంలో సంత నిర్వహణను సదరు యజమాని అడ్డతగలడంతో అశ్వాపురం–అమెర్ద రహదారి వెంబడి సంత నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో అమెర్ద రహదారికి ఎన్నడూ లేని విధంగా సోమవారం సాయంత్రం ఆర్టీసీ బస్సు రావడంతో సర్పంచ్, వ్యాపారులు, స్థానికులు అడ్డుకున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలో సంత నిర్వహణకు స్థలం కేటాయించాలని వ్యాపారులు, ప్రజలు, పంచాయతీ పాలకవర్గం కోరుతున్నారు.

ప్రజాపంథా రాజీలేని పోరాటం

చర్ల: డివిజన్‌లో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాజీలేని ప్రజా పోరాటాలను సాగిస్తోందని అందుకే పార్టీలో చేరేందుకు ప్రజలు ఆకర్షితులవుతున్నారని ఆ పార్టీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి కెచ్చెల కల్పన అన్నారు.

సోమవారం చర్ల మండలంలోని ఆర్ కొత్తగూడెంలో వివిధ పార్టీలకు చెందిన 30 కుటుంబాల వారు ప్రజాపంథా పార్టీలో చేరిన సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కొండా చరణ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గిరిజనులు, దళితులు, బడుగు బలహీన వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తమ పార్టీ రాజీలేని పోరాటాలు చేస్తూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తోందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాలెం చుక్కయ్య, బాబూరావు, సుజాత, శివ, రవి, భాను తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' శిబిరం ప్రారంభం



కంటి వెలుగు శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి అన్నారు. మండల పరిధిలోని వినాయకపురం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ఆయన చేతుల మీదుగా కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన కూడా కంటికి సంబంధించిన పరీక్షలను చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ పాడియం సత్యవతి, ఎంపీటీసీ సభ్యురాలు మారుతి లలిత, పీహెచ్‌సీ వైద్యాధికారి రాందాస్, బీఆర్ఎస్ నాయకులు మందపాటి మోహన్ రెడ్డి, వెంకన్న, యూఎస్ ప్రకాశ్‌రావు, ఉప్పల ప్రసాద్, ఉప్పల మురళి పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో..

మణుగూరురూరల్: ఆర్టీసీ మణుగూరు డిపోలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటివెలుగు శిబిరాన్ని సోమవారం డిపో మేనేజర్ టి.స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిపో సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల సౌకర్యార్థం డిపో ఆవరణలో ఉచిత కంటి వెలుగు శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ శిబిరాన్ని వినియోగించుకుని ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు కంటివైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కంటి చూపు సమస్య ఉన్నట్లయితే వారికి కళ్లజోళ్లు, మందులను ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కనకదుర్గ, సూపరింటెండెంట్ మెకానికల్ మూర్తి, ఆర్టీసీ సిబ్బంది, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుతో మత సామరస్యం





ఇఫ్తార్ విందులో పాల్గొన్న భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, అశ్వారావుపేట ఎమ్మెల్యే నాగేశ్వరరావు

భద్రాచలంటౌన్: రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. భద్రాచలం పట్టణంలోని కౌసర్ మసీదులో సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ ఖాన్, పట్టణ అధ్యక్షుడు ఆరిఫ్, కార్యదర్శి బాబాజీ, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

దళితబంధు యూనిట్ పంపిణీ

భద్రాచలం పట్టణానికి చెందిన దళితబంధు లబ్ధిదారుడు అల్లాడి పాల్‌రాజ్‌కు మంజూరైన టెంట్ హౌస్ యూనిట్‌ను ఎమ్మెల్యే పొదెం వీరయ్య సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నరేష్, శ్రీనివాసరెడ్డి, సతీష్, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మెచ్చా..

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని పెద్దిరెడ్డిగూడెం పంచాయతీ బూర్గూడెం గ్రామంలో సోమవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొన్నారు. మసీదులో ముస్లిం సోదరులతో కలిసి నమాజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సర్వమతాలను సమానంగా ఆదరిస్తోందన్నారు. ఉపవాసం చేస్తున్న ముస్లిం సోదరులకు పండ్లను అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్, వైస్ ఎంపీపీ మామిళ్లపల్లి రామారావు, నున్న బసవయ్య,చల్లా రాంబాబు, మసీద్‌కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

దమ్మపేట: మండల కేంద్రంలోని పలు కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సోమవారం పరామర్శించారు. ఉన్న కొత్తపేట కాలనీలో ప్రమాదవశాత్తు మరణించిన రాజేందర్‌రెడ్డి, ఇటివలే మృతిచెందిన టీడీపీ నాయకుడు నాయుడు చెన్నారావు కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు దారా యుగంధర్, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, బీఆర్ఎస్ నాయకులు దొడ్డాకుల రాజేశ్వరరావు, యార్లగడ్డ బాబు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్యతో చేయూత



కేంద్ర పథకాలపై కరపత్రాలను అందజేస్తున్న ఏనుగుల వెంకటరెడ్డి

బూర్గంపాడు: తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లలకు కేంద్ర ప్రభుత్వ మిషన్ వాత్సల్య పథకంతో చేయూతనందిస్తుందని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల వెంకటరెడ్డి అన్నారు. తాళ్లగొమ్మూరు గ్రామంలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. 18 సంవత్సరాలలోపు వయసు ఉండి తల్లిదండ్రులను పోగొట్టుకున్న పిల్లల సంక్షేమం కోసం ప్రధాని మోదీ మిషన్ వాత్సల్య పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను అమలు చేయటంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కేంద్రం నిధులను దారిమళ్లించి రాష్ట్ర ప్రభుత్వం తమ సొంత పథకాలకు వినియోగిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కేశగాని శ్రీనివాస్ గౌడ్, వెలిశెట్టి రామారావు, కొండి ప్రభాకర్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విద్యుత్ కార్మికులు

భద్రాచలంటౌన్: తెలంగాణ పవర్ ఇంజనీర్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 17 తేదీ నుంచి విద్యుత్ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. పట్టణంలోని విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీఎస్‌పీఈ జేఏసీ చైర్మన్ మోహన్‌రావు మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగులకు ఏప్రిల్ 2022 నుంచి అందవల్సిన వేతన సవరణను యాజమాన్యం ఉద్దేశ పూర్వకంగానే ఆలస్యం చేస్తుదని ఆరోపించారు. సమ్మె సందర్భంగా రైతులకు, ప్రజలకు, పరిశ్రమలకు తీవ్ర అసౌకర్యం ఏర్పాడుతుందని అన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం చొరవ తీసుకొని సమ్మె నివారణ చర్యలు చేపట్టాని లేని పక్షంలో తరువాత జరిగే పరిణమాలకు యాజమాన్యం, ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. కార్యక్రమంలో టీఎస్‌పీఈ జేఏసీ కన్వీనర్ జీవన్‌కుమార్, సీటీఐ జిల్లా అధ్యక్షుడు కొలగాని రమేష్, ఉదయ్‌రత్న కుమార్, అశోక్, సీతారాము తదితరులు పాల్గొన్నారు.

'పొంగులేటి'కి విముక్తి

భద్రాచలంటౌన్: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయడం ద్వారా అయనకు బానిస సంకెళ్ల నుంచి విముక్తి లభించిందని ఆయన అనుచరుడు రత్నం రమాకాంత్ అన్నారు. పట్టణంలోని తెల్లం, పొంగులేటి క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాముడిని మోసం చేసిన కేసీఆర్‌కి తెలంగాణ అభివృద్ధి కోసం కృషి చేసే నాయకులు నచ్చరని విమర్శించారు. ఈ సందర్భంగా పొంగులేటిని పార్టీ నుంచి సస్పెండ్ చేసినందుకు సీఎం కేసీఆర్‌కి పొంగులేటి అభిమానుల తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో ఎండి.నవాబ్, రాజీవ్, రజినీకాంత్, సుధాకర్, శ్రీనివాసరావు, విజయ్‌కుమార్, వెంకట్, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ గ్రహీతకు సన్మానం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్రం ఒప్పంద ఆధ్యాపకుడిగా పనిచేస్తున్న అంగడాల శ్రీనుకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించిన సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృదం సోమవారం ఆయనను ఘనంగా సన్మానించారు. అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.భద్రయ్య, అధ్యాపక బృదం పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

అశ్వాపురం: మండల కేంద్రంలో టీడీపీ సెంటర్, వారంతపు సంత ప్రాంతంలో సోమవారం రాత్రి ఎస్‌ఐ సురేష్ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న పలువురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సురేష్ హెచ్చరించారు.

బాల్య మిత్రుడికి వితరణ

భద్రాచలంటౌన్: తమతో పాటు చదవుకున్న మిత్రుడు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న బాల్య మిత్రులు అండగా నిలిచారు. పట్టణంలోని కొర్రాజులగుట్ట స్కూల్‌లో వెంకటేశ్వర్లుతో పాటు చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని ఆయనకు సోమవారం అందజేశారు. అలాగే వెంకటేశ్వర్లు కుటుంబానికి స్థానిక దుర్గా స్వీట్స్ యజమాని బిర్రు సుధాకర్, సరిత దంపతులు బియ్యం, దుప్పట్లు, దుస్తులు, నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో రమణ, రామ్మోహన్ నాయుడు, పుల్లయ్య, సాకేత్, కార్తికేయ, వెంకటేష్, ఆర్జున్, ప్రియాంక పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

అన్నపురెడ్డిపల్లి: కరోనా వైరస్ వ్యాప్తి చెందుతుండడంతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక కోరారు. మండలంలోని ఎర్రగుంట పీహెచ్‌సీలో కరోనా అనుమానితులకు పరీక్షలు నిర్వహించగా ఇద్దరు వ్యక్తులకు కరోనా పాజిటివ్‌గా తేలిందని ఆమె తెలిపారు. మండలంలోని బూర్గుడెం, పెద్దిరెడ్డిగూడెం గ్రామాలలో పాజిటివ్ కేసులు నమోదైనాయన్నారు.ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలని, కరోనా వైరస్ నివారణకు సహకరించాలని సూచించారు.

ఇళ్ల స్థలాల కోసం వినతి

చండ్రుగొండ: ఆదివాసీ పేదలకు మండలకేంద్రం చండ్రుగొండల ఇళ్లస్థలాలు కేటాయించాలని ఆదివాసీసంఘం జిల్లా నాయకులు కుంజా వెంకటేశ్‌దొర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీ పేదలకు కలిసి సోమవారం జిల్లా కలక్టర్ అనుదీప్‌ను కలిసి ఈ మేరకు మెమోరాండం అందించారు. ఇళ్ల స్థలాల కోసం మండల అధికారులకు ఆదివాసీ పేదలు దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా స్పందించాలని అన్నారు. ఆయన వెంట సంఘం నాయకులు తెల్లం నర్సింహారావు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇవ్వాలి

చండ్రుగొండ: గ్రామీణ వైద్యులకు వృత్తిపరమైన శిక్షణా తరగతులు నిర్వహించాలని గ్రామీణ వైద్యుల సమాఖ్య రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఎస్డీ నూరే రబ్బాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామీణ వైద్యుల మండలస్థాయి సమావేశం చండ్రుగొండలో సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైద్యులకు శిక్షణతోపాటు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో వైద్యులకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ నెల 12న, జిల్లా కేంద్రం కొత్తగూడెంలో సంఘం జిల్లాస్థాయి సమావేశం ఏర్పాటు చేశామన్నారు.

బాలల హక్కులపై అవగాహన

బూర్గంపాడు: బాలల హక్కులపై ప్రతిఒక్కరూ కనీస అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల అన్నారు. పినపాక పట్టీనగర్ గ్రామంలో జిల్లా చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలలు ఎవరైనా వేధింపులకు గురవుతుంటే 1098 కాల్ చేయాలన్నారు. బాల్యవివాహాలు, బాలల విక్రయాలు, వేధింపుల విషయంలో అప్రమత్తంగా ఉండి చైల్డ్ లైన్ 1098ని ఆశ్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో లలిత, లత, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఆర్థిక 'చేయూత'

బూర్గంపాడు: సోంపల్లి గ్రామానికి చెందిన నస్కూరి ముత్తయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా.. వైద్యఖర్చులకు కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. విషయం తెలిసిన మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన చేయూత ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం రూ.5 వేల ఆర్థికసాయమందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కైపు లక్ష్మీనారాయణరెడ్డి, ట్రస్ట్ ప్రతినిధులు జక్కిరెడ్డి మల్లారెడ్డి, కైపు నాగిరెడ్డి, పుట్టి రాజేష్, శనగ మల్లేశ్వరరావు, వేముల సురేష్, సాయిబాబు,గంట మస్తాన్‌బాబు, బిజ్జం వెంకట్రామిరెడ్డి, కామిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన త్రిపురసుందరి వార్షికోత్సవం



చండీహోమం నిర్వహిస్తున్న అర్చకులు

మణుగూరురూరల్: మణుగూరు ఏరియాలోని బంగ్లాస్ పరిధిలో ఉన్న శ్రీలలితా త్రిపురసుందరి దేవీ ఆలయంలో అమ్మవారి పంచమ వార్షిక మహోత్సవం సోమవారంతో అత్యంత వైభవోపేతంగా ముగిసింది. ఈ మహోత్సవంలో ఏరియా జీఎం దుర్గం రామచందర్ దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. అర్చకుల మంత్రోచ్చరణల నడుమ అమ్మవారి చండీ హోమం వైభవంగా జరిగింది. హోమ కార్యక్రమంలో జీఎంతో పాటు ఏరియా అధికారులు, కార్మికులు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి వార్షిక మహోత్సవానికి ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ సభ్యులను, ఉత్సవాల నిర్వహణకు రూ.10వేల విరాళం అందించిన పీకేఓసీ ప్రాజెక్ట్ ఇంజనీర్ వీరభద్రుడుని, భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణగా అందించిన ఏరియా ఇంజనీర్ మట్ట నర్సిరెడ్డిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్వోటు జీఎం డి.లలిత్‌కుమార్, ఏజీఎం (సివిల్) డి.వెంకటేశ్వర్లు, ప్రాజెక్ట్ మేనేజర్ రాముడు, డాక్టర్ శేషగిరి, అధికారులు, కార్మికులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రామయ్యను దర్శించుకున్న ఏఎస్పీ

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామచంద్రస్వామి వారిని ములుగు జిల్లా ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్ కుటుంబ సభ్యులతో స్వామివారిని సోమవారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలను నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం పంచవటీ కుటీరం, నారచీరల ప్రాంతాలను సందర్శించి వాటి విశిష్టతను గూరించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్సై కేశవ్, ఆలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

విజయవంతం చేయండి

భద్రాచలంటౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఒప్పంద ఉపాధ్యాయుల 12 నెలల (వేసవి సెలవులతో కూడిన) వేతనాన్ని సాధించడంలో సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపేందుకు ఈ నెల 14న ఏర్పాటు చేసిన హలో సీఆర్‌టీ.. చలో భద్రాద్రి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఆర్‌టీ సంఘం డివిజన్ ఇన్‌చార్జ్ ధనలక్ష్మి అన్నారు. భద్రాచలం పట్టణంలో సోమవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వేతనాలు సాధించేందుకు సహరించిన పీఆర్‌టీయు రాష్ట, జిల్లా నాయకులను సన్మానించేందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పని చేస్తున్న గిరిజన ఆశ్రమ పాఠశాల ఒప్పంద ఉపాధ్యాయులు ఈ కృతజ్ఞతల సభకు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆమె కోరారు. రమ్య, రాధా, శ్రీదేవి, విజయలక్ష్మి, విజయ, నిరోషా, రాజేష్ మంగీలాల్ పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

మణుగూరుటౌన్: కరీంనగర్‌లోని రాగిణి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన ఎస్‌పీటీ ఇంటర్ స్టేట్ ఒలంపియాడ్ 2022–23లో మణుగూరు ఎక్సలెంట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు పాఠశాల కరస్పాండెంట్ ఎండి.యూసఫ్ షరీఫ్ తెలిపారు. ర్యాంకులు సాధించినవారు రాష్ట్ర పౌర సరఫరాలు, బీసీ సంక్షేమా శాఖ మంత్రి గంగుల కమలాకర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నట్లు తెలిపారు. యాజమాన్యం సోమవారం పాఠశాల ఆవరణలో ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్స్ ఎండి.ఖాదర్, యాకూబ్‌షరీఫ్‌లు పాల్గొన్నారు.

రేపు కంటి వైద్య శిబిరం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని పాత ఎల్ఐసీ ఆఫీస్ రోడ్‌లోని ఆల్‌పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఈ నెల 12 ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వరంగల్‌కు చెందిన శరత్ మ్యాక్సీ విజన్ ఐ ఆస్పత్రి వైద్యులచేత పరీక్షలు నిరహిస్తారని తెలిపారు. కేంద్ర, రాష్ట ప్రభుత్వ ఉద్యోగులు, కోల్‌మైన్స్ పెన్షనర్స్, హెల్త్ కార్డు ఉన్నవారు ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకోవచ్చని పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సేవా కార్యక్రమాలు చేపట్టాలి

అశ్వారావుపేటరూరల్: సేవా కార్యక్రమాలను నిరంతరం చేయాలని ప్రముఖ హీరో ప్రభాస్ పీఏ రామకృష్ణ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం అశ్వారావుపేట కెమిలాయిడ్స్ విశ్రాంతి భవనంలో స్థానిక ప్రభాస్ ఫ్యాన్స్‌ను కలిసి గత కొన్నేళ్లుగా స్థానిక ఫ్యాన్స్ చేపట్టిన సేవా, ఇతర కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభాస్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యకలపాలను రానున్న రోజుల్లో మరింత విస్తృతంగా చేపట్టాలని, పేదలకు లబ్ధి చేకూరే విధంగా కృషి చేయాలని అన్నారు. స్థానిక ఫ్యాన్స్ సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు జిల్లా, రాష్ట స్థాయి ఫ్యాన్స్ బాధ్యులు తమ వంతు సహకరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ప్రభాస్ ఫ్యాన్స్ బాధ్యులు దండు శ్రీనివాసరాజు, పాటి ధనబాబు, కె.చైతన్య, అప్పాజీ, ఎస్‌కె.మస్తాన్, సత్తిబాబు ఉన్నారు.

సిద్ధులుకు సన్మానం

భద్రాచలంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సైనిక్ బోర్డు సభ్యుడిగా ఎన్నికైన భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తిప్పన సిద్ధులును శాఖ గ్రంథాలయం, భద్రాచలం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని శాఖ గ్రథాలయ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సన్మాన గ్రహీత సిద్ధులు మాట్లాడుతూ..సైన్యంలో పని చేసి రిటైర్డ్ అయిన సైనికుల కుటుంబాలకు అండగా ఉంటానన్ని అన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మానె రామకృష్ణ, తిరుపతిరావు, రాంబాబు, రవికుమార్, చాట్ల రవికుమార్, సమ్మయ్య, చారీ, శంకర్‌రావు, శ్రీను, బషీర్, పుల్లారావు, జానీ పాల్గొన్నారు.

రేషన్ దందాను అరికట్టాలి

బూర్గంపాడు: రేషన్ బియ్యం అక్రమదందాను అరికట్టేందుకు జిల్లా ఉన్నతాధికారులు కఠినచర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు పున్నంచంద్ కోరారు. సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని కొందరు రేషన్ డీలర్లు, వ్యాపారులు కుమ్మకై బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారానికి అడ్డుకట్ట వేయకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.